సమ్మె పిలుపు

నాలుగు రోజులనుంచి, వరుసాగ్గా, ముసురు పట్టి నేలంతా చితచితలాడిపోతోంది. ఆ జారుడులో భద్రంగా కాలుదీసి కాలుపెడుతూ నడుస్తోంది ఎర్రి. తైల సంస్కారం లేక ఔరుదుబ్బులా రేగినతల, ఎడమ చంకలో తట్ట, తట్టలోనుంచి పైకి తొంగిచూస్తోన్న చీపురు, కుడిసందిట్లో వీపుమీదుగా కట్టుకున్న అడ్డాలలో బిడ్డ, కుడిచేతిలో చిన్న బొక్కెన-పైగా నిండు గర్భిణీకూడా నామె. నడవలేక నడవలేక నడుస్తోంది. అచ్చంగా పెద్ద గడ్డిబండిలాగా కన్పడ్డది. ఆ తెల్లవారగట్ల మసకచీకట్లో—

బయల్దేరడం అయితే అందరితోపాటే బయల్దేరింది. కాని - ఆఫ్వార్రి బైట మాగాణీ పొలాల్లోంచి మస్తరు వేసుకునే చోటికి ఆ సరంజామానూ, ఆ మాత్రపు దేహాన్ని యీడ్చుకొచ్చేసరికి అన్నీ ఐపోయినాయి. తాను పనిలో ప్రవేశించినాక ఏనెలా పూర్తి జీతం తీసుకోనేలేదు. మరీ క్రిందటి నెల జీతమంతా జరిమానాలక్రిందే పోయింది.

"ఏడు తిరగమారకతలికే పాపిట్టి కడుపొత్తంటే ఎట్టాసచ్చేట్టురా బగమంతుడా'' అనుకుంటూ మేస్త్రీ ఎదురుగుండా నిలబడింది.

భారతదేశం సంతానానికి ప్రఖ్యాతమనీ, అలాంటి సంతాన భాగ్యాన్ని అలా అనుకోడం ఘోర తప్పిదమనీ, పాపం! ఆపాకీపని చేసుకునే దాని కేం తెలుస్తుంది?

"చంకనోపిల్ల-కడుపులోపిల్ల - పో! త్వరగా పో!" అన్నాడు మేస్త్రి.

ఆ గొడ్డుమోతు మేస్త్రి చూపుల్తోనే తన సంతానాన్ని మింగుతున్నాడా! అనిపించింది ఎర్రికి—

"బుడ్డదానికి నాలుగునాళ్లనుంచీ కాళ తగుల్తుందండీ" అన్నది ఎర్రి-

చీదరగా వోకసారిచూచి "సరేలే పో!" అన్నాడు మేస్త్రి.

ఎర్రి వెనక్కు-తిరిగింది. అసలు ఆ మిడిగ్రుడ్ల మేస్త్రీనిచూస్తేనే తనకు భయం. ఏంమాట్లాడేటట్టు?

తట్టలో ఆకులు లేవు. ఎత్తి తట్టలోవేసే అసహ్యమంతా యిక ఎర్రిమీదే వుంటది.

"ఓపలేనిమడిసిని. ఒంగుతా లేత్తా అరవైదొడ్లు చేసేదెట్టా?" అనుకుంటూ కాలు కొంచం సాచి వేస్తూ పోతోంది.

రోడ్డుమీద పెంచలగాడు కర్రచీపురు బుజాని

కానించుకుని, ఏరుకున్న బీడీలను చిరుగులపంచలో చుట్టి రొంటిని దోపుతున్నాడు.

"ఇంత యాలకెల్తే యాడన్నా యెంగిలాకు లుంటయ్యా? బేగిపా. పెద్దగాడిదకొడుకేం జేత్తుండడు. గుడిసె లోపటజేరి కప్పకాళ్ళకి తాళ్లుపోసి ఆడుకోపోతే యిట సావబెట్టకపోయా?" అన్నాడు.

ఎర్రి కొంచం కాలు జాడించింది. ఏహోటలు దగ్గర చూచినా వట్టి ఆకులే.

"దొంగ నంజలు. అప్పుడే తుడుసుకు పోయుండ్రు." అంటూ హోటలు హోటలుకూ తిరిగింది.

చివర కొకసందులో హోటలు గోడక్రింద, గంజిగుంట ప్రక్కగా ఆకులకుప్ప కనపడ్డది. ఏముంది? ఒకటి రెండు ఆకుల్లో అల్లపు పచ్చడితప్ప- ఎర్రిలాంటివే ఏకుక్కలో నాకివేసి పోయాయి.

"హుఁ! యీ కేసనింగురోజుల్లో, మెతుకు లేదుంటాయి. కుక్కలే అల్లాడిపోతుంటేని—' అనుకుని పచ్చడి తీసి నాలుకకు వ్రాసుకుంటూ మిగతా పచ్చడి బొక్కెనలోనూ, ఆకులుతట్టలోనూ వేసుకుని బయలు దేరింది.

ఆవేళ దొడ్లన్నీ పూర్తయేసరికి ప్రొద్దు నెత్తిమీదికొచ్చింది. రోజూ అలవాటే ఐనా ఆ రోజు మురుగుడు మూలాన్నో యేమో! ముక్కులు బద్దలు

కొట్టుకు పోయాయి. దారిలోనే తలబద్దలు కొట్టుకుపోవడం సాగింది.

"తోలింబరంగా సెలవెట్టితే మలిదినాల్లో కట్టం. ఆసెలవ రోజుల్లోనన్నా బుడ్డాణ్ణియేత్తే సరిపోతది. దానికి ఆపీసరుగోరికి పది రూపాయలు మునుపు కట్టుకోవాలె. వచ్చేపది అట్టాపోతే—"

గుడిసెలోకి పోయిచూస్తే ఎవరూ లేరు. ఒక మూల గోనెపట్టామీద మునగదీసుకుని పడున్నాడు మామ కుష్ఠుకోగంతో.

మామ కాళ్లూ, చేతులూ చూస్తే ఆవేళ ఎందుకనో భయంవేసింది. తన చేతులూ కాళ్లూ అలానే అవుతాయి. ఈరోజు తన చేతుల్తో తాను అన్నందినే రాతలేదు. ఇంట్లో ఎవ్వరూలేరు. పిల్ల ఎటో ఆడటానికి పోయింది. పెద్ద బుడ్డాడు సరేసరి. మొగుడు 'పెంచలు' ఎటుబోయ్యాడో? బొంగునజూస్తే బుట్టలేదు.

"పీతల పట్రాను పోయుండుగామాలు. తెల్లారింది మొదలేసుకుని పను కుంగిందాక పొట్ట దేవులాటకే సరిపాయె."

చంకలోనే నిద్రబోయిన బిడ్డని ఒకప్రక్కని పడేసి ఆగుడిసే ఆగుడిసే తిరిగి ఓ అమ్మను పట్టుకొచ్చింది. "రామే! యీయా లింత కూడుతినిపిద్దుగాని–యీ సేతుల్తో తిన రోతేత్తుండది" అని—

"యీముండ దిందిట్లో - యియిగో" కుండ
పైకెత్తి చూపించిం దా యమ్మ.

"ఉండకాసింతా పెద్దగున్న దిని ఏగుట్టలకో
సచ్చిందు. ఆటలకి——"

ఆ కాసిని మెతుకుల్లోనూ తాను తెచ్చుకున్న
అల్లపు పచ్చడి కలిపి యింత నోట్లో వేయించుకున్నది.

ఆ సాయంత్రం "నాగాపడితె ఆసిర్లే" అని
పోలేక అల్లాగే గుడిసెలో పడుంది. పెంచెలుమాత్రిం
బుట్ట గుడిసెలో పారేసి డ్యూటీకెళ్ళాడు. ప్రొద్దుకూకే
వేళకు తిరిగివచ్చాడు.

పీలికలు పీలికలుగా వ్రేలుకాడుతోన్న ఆ చేతు
ల్లేని నల్లచొక్కా-మీద ఎర్రటి చీటివుంది.

"ఓలమ్మో! తెల్లారితే సమ్మె." ఆచీటీ
రోజూ చూస్తూనేవుంది ఎర్రి. కాని యీవేళ ఎందుకనో
గాబరాపడ్డది. తాను రేపూమాపట్లో ప్రసవించ
బోతోంది. ఎంతలేదన్నా ఐదురూపాయులుఖర్చు. ఆ పాడు
గుడిసెకే అద్దెకూడా కట్టాలి. క్రిందటి నెలజీతమంతా
కోతలక్రిందే పోయింది. జీతంమాత్రిం ఎంతజీతం?
తొమ్మిదిరూపాయులు;కరువుదో పదారు; మొత్తం పాతిక-
తన జీతంగూడా కలిపి, అన్నీ సరిగ్గావస్తే యాభై. ముస
లాడు, తాను, పెంచలు, ముగ్గురు పిల్లలు, ఏమూలకి
యీ కరువురోజుల్లో. ఇప్పుడు సమ్మెజేస్తే ఎట్లా? పోయి

ఖాతాదారు కోనప్పకాళ్ళమీద పడాలి.

కోనప్ప జ్ఞాపకంవచ్చేటప్పటికి కొయ్యబారి పోయింది ఎర్రి. క్రిందటి నెల వాడిదగ్గరతీసుకున్నది 10 రూపాయలు-రూపాయికి బేడాకాడికి పదిబేడలు రూపాయి పావలా నెలచెల్లేసరికి ముందుగానే జీతంలో తీసుకుంటాడు. "అమ్మయ్యో!" మొగుడికి దగ్గరగావచ్చి "ఒరేమాావు! నువ్వుగూడా సమ్మెకడతవుర?"

"ఓ! కట్టక — తస్సాదియ్య! పాతికేళ్ళ మట్టె పనిజేత్తావుంటే వేటికి రూపాయికాడికన్నా పెంచక పోతే!"

"సమ్మెసెయ్యమాకరా! నేను రేపోమాపో నీల్లాడుతాను."

"ఓయ్! నీల్లాడు - పొల్లాడు. సమ్మెచేసి చూపిత్తా."

"అదిగాదురా. కర్జు సూసుకుండావా?"

"తాలుండికె. లెక్కని వల్లబై దొడ్డలంట; కెయ్యబోతే ఎనబైదొడ్లు. సత్తావుంటేను-"

"ఇనిపిచ్చుకో కొత్త-పని వూడుద్ది-"

"సీతాత తల్లోపేను డిగిరావాల. తెల్సా?"

"ఆ - ఎవుడో ఒకడు అందులో యిరుక్కుంటే—"

"ఓడాయిరుక్కునేది? కడుపున కనుకున్న

బిడ్డకి చెయ్యడానికే తల్లి ఎరుసుద్దే. అట్టాంటిది మనం మట్టిదిని యేలకుయేలు చేత్తావుంటే-ఓడే ఆ కనికారంలేని యదవ నాయాలు.''

''కోటప్పగాడిపని సూశావా? ఏమైందో-పని లేక తిరుగుతుండాడు. సేతులో డబ్బున్నావుంటే—''

''అందుకే - యీడాదికి నెలజీతం బోనాసు రావాల. సరైన పనిముట్లూ యియ్యాల...''

తాగున్నాడేమోనని మెదలకుండా పోయింది ఎరి.

''చూసుకో. యీదెబ్బతో —! పెద్దపెద్దో రంతా జీతాలు పెంచుకోడమున్నా—''

సమ్మె నోటీ సివ్వడానికి పోయినరోజున తాను కూడా ఊరేగింపులో వెళ్లింది ఎరి. సంఘం పెట్టుకున్న తర్వాత మేస్త్రీల మామూళ్లు, ఆఫీసరుగారింట్లో అరవ చాకిరీ, తప్పిపోయిందన్న సంగతి మరచిపోలేదు. కాని... రాబోయే ప్రమాదాన్ని కొండలా తలచుకొంటూంటే-యిప్పుడవన్నీ అంతగా పనిచెయ్యడంలేదు. ఆ రాత్రల్లా ఆలోచనల్తోనే నిద్రబోయింది. మర్నాడు ఉదయం ఆలస్యంగా నిదరిలేచింది.

అప్పటికప్పుడే-పెంచలు మేదరబుట్ట తీశాడు. పెళ్లినాటి బట్టలు కాలవకట్టమీద బుడబుక్కలవాళ్లదగ్గర కొన్నవి తీసికట్టాడు. బయల్దేరబోతున్నాడు.

గభాలునవచ్చి కావిలేసుకొంది ఎర్రి.

"ఉండోశె. పిచ్చిముండ! పంటసేను వొదిలి పరిగ యేరుకుంటావంట. సమ్మె నాలుగురోజుల కట్టానికి జడిసి, సచ్చిందాకా కట్టపడమంటావంటే. లే! వొదులు. నేనొక్కణ్ణేనంటే – వొదులు." అని విదిలించుకుని గుడిసెలోనుంచి బయటబడ్డాడు. చంటిదాన్నెత్తుకుని తానూ బయటికి వచ్చింది.

గూడెంకు తూర్పు ప్రక్కగా మామిడితోపులో సూర్యుడు వుదయిస్తూ అందంగా ఎర్రగావుంది.

రండోయ్! రండోయ్! పేదల్లారా!
పోరాడ్దాం మన హక్కులకై

....

పోయే దేముందోయ్ మనకింకా
పోతే యీ పేదరికమెనోయ్!

....

ఉక్కుముక్కలుగ ఒక్కుమ్మడిగా
పోదాం రండోయ్ పేదల్లారా!

రంయ్యిన ఆ అన్నిరకాల గొంతులూ ఒక్కసారిగా మోగాయి ఒక్కటిగా.

ఎర్రిఅలాచూస్తూనే ఆగుంపుతో వెళ్లిపోతోంది.

గుడిసెలో పడున్న మామ చెవుల్లోసైతం అదే ధ్వని గింగిరెత్తుతూవుంది.

—